

# అమ్మఒడి

ముప్పిడి ప్రభాకరరావు

గ్రాండ్ పప్పా! గురజాడ అంటే ఎవరు?

సంగతేమిటట?

ఆయన "పెద్ద మసీదు" కథ చదివా?

ఆహా నాకు నచ్చిన చాలా మంచి కథరా అది. ఆధునిక కథను గురించి చెప్పాల్సివస్తే-అసంపూర్తి కథే అయినా-ముందుగా ప్రస్తావించాల్సిన కథరా అది.

అది సరేగాని-ఆ కథలో రామశాస్త్రులుగారున్నారే-ఆయనకూ నీకూ పెద్ద తేడా లేదు గ్రాండ్ పప్పా!

ఎందులో?

ఆ కథలో రామశాస్త్రులుగారు వాళ్ళూరి శివాలయం గూర్చి ఆకాశమంత ఎత్తుంటుందనీ, చూడ్డానికి రెండు కళ్ళూ చాలవనీ తన శిష్యుడు మిడతం భొట్లుతో తెగ ముచ్చటిస్తాడు.

ఏమిట్రోయ్! పెద్ద మాటలు విసిరేస్తున్నావు నా మీద. ఈ ఊరి గడియారపు స్తంభం గురించి నేను కూడా దారి పొడవునా చాలా చాలా చెప్పాననే కదూ, నీ వంటున్నది. సరే-ఇప్పుడు పోయిందే ముంది? మనం మరో పది నిముషాలు ముందుకు నడిస్తే, అదిగో ఆ మలుపు తిరిగాక అదే కనిపిస్తుంది. అప్పుడందువుగాని-

ఇంకా ఏమనాలి? ఊళ్ళో ఏ మూల నుండి చూసినా అది అంతెత్తులో కనిపిస్తుందన్నావ్..... ఏదీ? అదెక్కడ? ఇంత దూరం వచ్చాక కూడా కనిపించదేం?

ఎలా కనిపిస్తుంది? నా చిన్నప్పుడంటే ఎక్కడ చూసినా చిన్న చిన్న తాటాకు ఇళ్ళూ, పెంకుటి లోగిళ్ళూనూ. ఇప్పుడు చూడు..... ఐదారేసి అంతస్తుల అపార్టుమెంట్లూ, ఆకాశ హర్మ్యాలూనూ- అవి ఆకాశాన్ని పూర్తిగా కమ్మేశాయి మరి. అదిగో ఆ మలుపు తిరిగితే ఆ గడియారం స్తంభం నేను చెప్పినట్టు అంతెత్తులోనూ కళ్ళు చెదిరేలా కనిపిస్తుంది. నీవే చూద్దువుగాని-

ఇంతకూ నీవెప్పటి సంగతి చెప్తున్నావ్ గ్రాండ్ పప్పా!


నా చిన్నప్పటి సంగతేరా-

ఇప్పుడు నీ వయసెంత గ్రాండ్ పా!

ఈ తరానికి నేనే అతి వృద్ధుణ్ణి. గత తొమ్మిది దశాబ్దాల్లో ప్రపంచంలో జరిగిన అనేక మార్పులకు నేను ప్రత్యక్ష సాక్షిని-

## వేదుల చిన్న వేంకట చయనులు - నవ్యవీక్లి కథల పోటీలో

# ద్వితీయ బహుమతి రూ. 8,000 పొందిన కథ



గ్రాండ్ పప్పా! నీవు రెండవ ప్రపంచ యుద్ధాన్ని ఎరుగుదువా?

అంతకు ముందు వచ్చిన ఆర్థిక మాంద్యాన్ని కూడా ఎరుగుదును.

సరి సరి – అయితే మీ నుండి తెలుసుకోవలసినవి చాలానే ఉన్నాయి గ్రాండ్ పా!

అలానే.... మీరు కూడా తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయి.

మన దేశానికి అర్ధరాత్రి స్వతంత్ర్యం వచ్చినట్టు, ఓ అర్ధరాత్రి హరికేను లాంతరు గుడ్డి వెలుగులో ఓ ఎరుకలామె మంత్రసానిగావచ్చి, నా తల్లికి పురుడు పోస్తే నేను పుట్టానట. అప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులున్నా, క్రైస్తవ మిషనరీ ఆసుపత్రులున్నా, పెద్ద పెద్ద పట్టణాలకే అవి పరిమితం. మిగతాచోట్ల ఈ ఎరుకల మంత్రసానులే ఆశేష ప్రజానీకానికి లేడీ డాక్టరులయినా, గైనకాలజిస్టులయినా–

ఇప్పుడు మీరంతా ఏ కార్పొరేట్ ఆసుపత్రి ఎ.సి. రూములోనో ఓ స్పెషలిస్టు డాక్టరు వచ్చి మీ తల్లికి కాన్పు చేయగా మీరు పుట్టుకొస్తున్నారు. మీరు పుట్టగానే సెల్‌ఫోన్ మీ చెవి దగ్గర కొస్తుంది. మీ మొట్టమొదటి ఏడుపు అమెరికాలోనో, లండనులోనో ఉన్న మీ డాడీ వింటాడు. మీరు బోర్లబడి లేచి కూచోగానే మీ ముందుకు ఓ టీవీయో, కంప్యూటరో వచ్చి కూచుంటుంది. ఊహకే అందనంతగా ఈ సాంకేతిక ప్రపంచం మారిపోయింది.

ఇప్పుడు మీరనుకుంటున్నారు–ఈ ప్రపంచం ఎప్పుడూ ఇలానే వుందని, అయితే మీరెరిగిన ప్రపంచమే మీకు తెలుసు. కాని మేము మారిన ప్రపంచాన్నీ, మారని ప్రపంచాన్నీ రెంటినీ చూసిన వాళ్ళం.... తరాల అంతరాలను చూసిన వాళ్ళం. అందుకే ఈ మార్పు మమ్మల్ని చకితుల్ని చేస్తుంది.

గ్రాండ్ పా! మార్పన్నది సహజం కదా! ఏ అద్భుతమో జరిగి ప్రపంచం మీద ఈ మార్పు ఒక్కరోజులో రాలేదు కదా? నీ వెందుకింత ఆశ్చర్యపోతున్నావ్?

నిజమే! ఈ మార్పు ఏ అద్భుతమో జరిగి రాలేదు. నిన్నటి గర్భం నుండి పుట్టినదే నేటి అభివృద్ధి అంతా. అయితే మా తరం వాళ్ళం ఈ వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నాం.......

అనూహ్యమైన అభివృద్ధి మనల్ని చకితుల్ని చేయదా–

గ్రాండ్ పా! ఇప్పుడు మనం ఎక్కడికి వచ్చాం?

ఒకప్పుడిది ఐదు లాంతర్ల సెంటరు అయ్యుండొచ్చు! అంటూ కలయచూసి, మరిప్పుడు దీన్నేమంటున్నారో నాకూ తెలియదు అన్నాడు.

ఐదు లాంతర్ల సెంటరా! తమాషాగా వుందే....

అప్పట్లో ఈ ప్రాంతాలను అలానే పిలిచేవాళ్ళం. ఐదు లాంతర్ల సెంటరనీ, మూడు లాంతర్ల సెంటరనీ..... విద్యుత్తును మేం ఎరగం కదా. ఈ కంకర రోడ్ల మీద ఇక్కడో దీపస్తంభం, అక్కడో దీపస్తంభం వుండేది. కిరసనాయిలుతో వెలిగే హరికేను లాంతరులు ఆ ఎత్తయిన స్తంభాలమీద గుడ్డి గుడ్డిగా వెలిగేవి...... చీకటి పడితే ఇళ్ళల్లోనూ, ఈ కిరసనాయిలు హరికేను లాంతరులే–నేను నా ఎఫ్.ఎ. చదువు కూడా ఈ కిరసనాయిలు దీపాలవద్దే చదివా మరి.

విద్యుత్తు లేకుండా, సెల్‌ఫోను లేకుండా, కంప్యూటర్లూ, టీవీలూ లేకుండా ఓ ప్రపంచం వుందా గ్రాండ్ పప్పా! అప్పుడు మీ జీవితం మీ కెలా అనిపించింది? రియల్లీ ఐ పిటీయూ–

ఇవేవీ ఆనాడు మాకు అందుబాటులో లేకున్నా మేం సుఖంగానే బతికాం. ఏ కష్టమూ అనిపించలేదు. మేం అనుభవించిన చాలా వాటిని మీరు పోగొట్టుకున్నారు. అందుకని ఆ కాలం కూడా మాకు గొప్పదే..... అవసరాన్ని బట్టే అన్నీ అలవడతాయి.

గ్రాండ్ పా! ఇంత దూరం కాలి నడకన వచ్చావ్– అలసట అనిపించడం లేదా? ఏదైనా ఆటోను పిలవమంటారా?

ఒద్దురా! నా నడకే నా ఆరోగ్యం. మా బడి చదువులన్నీ కాలి నడకనే సాగాయి. మీకులా మాకు అప్పట్లో కాన్వెంటు బస్సులు గట్రా ఉన్నాయా? కనీసం సైకిలు రిక్షాని కూడా మేం యెరుగం.

అయితే మరి అప్పుడేముండేయట?!

ఒంటెద్దుబళ్ళూ, రెండెడ్ల బళ్ళూ, గుర్రాల్లాగే జట్కా బళ్ళూ,

మనుషులు లాగే రిక్షాలూ..... ఈ కార్లూ బస్సులూ మేం ఎరగనే ఎరగం.

గ్రాండ్ పా! ఎక్కడ నుంచో నీచు వాసన వస్తోంది–

ఔనురా! అది చేపల నీచు వాసన..... ఆ కనిపిం

చేదే ఉప్పుటేరు. ఎదర ఏరులాంటిదేదీ నాకు కనిపిం చటం లేదే-

కాస్త నిదానించి చూడు.

చూశాను. ఏదో పశువుల మందనుకుంటాను. పచ్చికమేసి తీరికగా నెమరేసుకుంటున్నాయి. చూడ్డానికి ఒంటెల మందలా బూడిద రంగులో కనిపిస్తున్నాయి. ఏరయితే నీరు నీలంగా కనిపించాలిగా?

అవి లంగరేసిన సముద్రపు వేట పడవలు. రాత్రి సముద్రం మీద పగలు ఉప్పుటేరులోనూ అవి ఉంటాయి. జాలర్లు రాత్రంతా చేపలు వేటాడి వస్తారు. అలా ఈ ఉప్పుటేరు ఆ సముద్రపు వేట పడవల్తో క్రిక్కిరిసినప్పుడు మన కంటికి నీరెలా కనిపిస్తుంది?

ఉప్పుటేరులో నీళ్ళు ఉప్పగా ఉంటాయా గ్రాండ్ పా!

అంతే కదా మరి- ఇక్కడ ఓ సెలయేరు సముద్రం వేపు ఉరకలేసి సముద్రంలోకి చొచ్చుకుపోయింది. సముద్రపు ఆటుపోటులకు ఈ యేరు తబ్బిబ్బయి ఉప్పొంగింది. ఉప్పొంగిన ఏరు ఉప్పనయి ఉప్పుటేరుగా మారింది.

ఈ ఏరు పొడవునా ఆనాటి నుండి నేటి వరకూ గొప్ప విదేశీ వ్యాపారం జరుగుతూనే ఉంది. ఓడల్లాంటి పెద్ద సముద్రపు పడవలు ఇక్కడ లంగరేసి రెడీగా ఉంటాయి. ఓడల్లోంచి సరుకు దించడానికీ ఎక్కించడానికీ రాత్రింబవళ్ళూ వాటితోపాటు జనం ఇక్కడ హడావుడిగా ఉంటారు. ఎడ్లబళ్ళూ, జట్టు కూలీలూ, గుమాస్తాలూ, బేరగాళ్ళూ, బ్రోకర్లూ ఒకరేమిటి...... అంతా ఒంటి కాలు మీదనే పనులు చేస్తారు. తాటినార, అపరాలు, కుంకుళ్ళూ యిలా ఎన్నో విదేశాలకు ఇక్కడ నుండే ఎగుమతవుతాయి. ఆ రోజుల్లో ఈ సరుకు వెండి రూపాయలను పండించేది. వేలమీదా, లక్షల మీదా, వ్యాపారం జరిగేది. వ్యాపారులు చక్కగా తోమిన పాల తెపాలాను వెండిరూపాయల్తో నింపుకుని చిక్కంవేసి బండి బిసిగ్రకు తగిలించి ఇంటికి తరలి వచ్చేవారు.

ఈనాడున్న కరెన్సీ నోట్లు ఆనాడు లేవు. అన్నీ వెండి నాణాలే.

గ్రాండ్ పా! ఉప్పుటేరు కొచ్చాంగానీ-ఏదీ నీ వన్న ఆ గడియారం స్తంభం?

అతడు చుట్టూ పరికించి చూసి, కాసేపు బిత్తర పోయి, ఔనురా!

అంతెత్తు గడియారం స్తంభం ఇక్కడ నుండి ఎలా మాయమయ్యింది? గడియారం స్తంభమే కాదు, ఇక్కడ పూల వంతెన కూడా ఉండాలి. బహుశా ఆ కనిపించే శిథిలావస్థలో ఉన్న వంతెనే ఆ పూల వంతెన అయి ఉండవచ్చు, అని ముందుకు నడక సాగించాడు.

ఆ వెడల్పాటి ఏటిగట్టుమీద అందమైన కాంక్రీటు సిమ్మెంటు రోడ్డు-

ఆ రోడ్డును చేర్చి తీర్చి దిద్దిన ఎత్తయిన అపార్టుమెంటు బిల్డింగులు-

వాటిని చూసుకుంటూ ఆ ఇద్దరూ-

గ్రాండ్ పా! ఇలా ఈ రోడ్డు వెంబడే ఎంత వరకు? మాయమైన గడియారం స్తంభం ఆచూకీ దొరికేదాకానా?

నీవేదయినా అనుకో-నేను చిన్నప్పుడు పుట్టి పెరిగిన ఊరురా ఇది.

ఎన్నో అనుభూతులు ఈ నేలతో పెనవేసుకుని ఉంటాయి నాకు.

అయితే గ్రాండ్ పా! ఈ అపార్టుమెంటు టెర్రస్ మీదకు ఎక్కిచూస్తే అదేమైనా కనిపిస్తాదేమో..... లిఫ్టకూడా ఉంది.

ఔనురా! ఊరంతా ఓ సారి కలయచూసి నట్టు కూడా వుంటుందిరా.

వెళ్ళి మేనేజరుంటే అడిగిరా-

అతడు కదిలి ఓ ఐదు నిముషాల్లో తిరిగొచ్చి, గ్రాండ్ పా! రండి, పై కెళ్దాం. అన్నాడు.

ఇద్దరు టెర్రస్ పైకి చేరుకున్నారు.

గ్రాండ్ పా! సముద్రంకేసి తదేక ద్యానంతో చూస్తున్నావు-

ఏమిటి సంగతి?

ఈ ఆకాశాన్నీ, ఈ సముద్రాన్నీ, అవి కలిసిన దిజ్మండలాన్నీ చూస్తుంటే థ్రిల్ అనిపించడం లేదూ?

"గగనం గగనాకారం
సాగరం సాగరోపమ
రామ రావణ వోర్యుద్ధం
రామ రావణ వోర్వివ....." అని అనన్వయాలంకారంలో జయదేవుడు ఎంత గొప్పగా చెప్పాడో, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నానురా అన్నాడు. అయితే

"ఆకాశానికి ఆకాశమే పోలిక,
సముద్రానికి సముద్రమే పోలిక'- అలాగే మీ గడియారపు స్తంభానికి దానికదే పోలికని చెప్తావో ఏమో!

లేదు లేదు. గడియారం స్తంభం లైట్‌హౌస్‌కు తోబుట్టువులా వుంటుంది కనుక అన్వయం వుంది.

గ్రాండ్ పా! సముద్రం నాకయితే వొట్టి ఎడారిలా కనిపిస్తోంది? ఎందుచేత?

అంటే.... సముద్రంలో నీళ్ళు తప్ప ఎక్కడా మొక్కా మోడూ కనిపించదు. ఎడారిలో ఇసుక తప్ప ఎక్కడా చెట్టూ చేమా కనిపించదు. సముద్రం మీదా ఎడారిలోనూ మనిషి తాగడానికి గుక్కెడు నీళ్ళు దొరకవు. కనుక నా దృష్టిలో ఒకటి నీటి ఎడారి, మరొకటి ఇసుక సముద్రమూను-

కాదంటావా గ్రాండ్ పా!

ఇసుక సముద్రంలోనూ, నీటి ఎడారిలోనూ ఓడలు మాత్రమే పయనిస్తాయి. అది ఓడయినా, ఎడారి ఓడయినా, దేశ దేశాల నుండి వర్తకులను ఈ దేశానికి తీసుకొచ్చింది.

ఔనౌను! గజనీ అయినా, ఘోరీ అయినా-లేదూ పోర్చుగీసయినా డచ్చివారయినా, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం వారయినా ఈ దేశ సంపదను కొల్ల గొట్టిన వారేకదా గ్రాండ్ పా!

పరాయిపాలనలో మనం పూర్తిగా నష్టపోయాం అనుకోవడం కూడా అంత సరియైనది కాదేమో-నిజానికి మనదేశం నష్టపోయింది వెండి బంగారాన్నీ, వజ్రవైఢూర్యాలనీ, అందగత్తెలైన స్త్రీలనూ, సర్వం కొల్లగొట్టుకుపోయిన మన పొరుగునే ఉన్న బందిపోటు విదేశీ చక్రవర్తుల వల్లనే-

గ్రాండ్ పా! ఇంతకూ మీ రన్న ఆ గడియారం స్తంభం ఇప్పటికయినా కనిపించిందా?

లేదురా..........

అయితే వయసు చేత మీ దూరపు చూపు మందగించిందో ఏమో-

సరిగా చూడండి నలుదిక్కులూ-

అలాంటిదేమీ లేదురా-అదిగో ఎదురుగా ఆ కనిపిస్తుందే రైల్వే స్టేషను. ఆ పక్కన పెద్ద రాతి కట్టడం వుందే అదే రైల్వే ఇన్‌స్టిట్యూట్- ఇటు జగన్నాథపురం వేపు దూరంగా కనిపిస్తుందే అదే రోమన్ కాథలిక్ వారి చర్చి. నాకు కనిపించనిదల్లా గడియారపు స్తంభమే.....

బహుశ ఈ ఆకాశ హర్మ్యాల చాటున ఎక్కడో అది కనుమరుగై ఉండవచ్చు.

అయితే మనం క్రిందికి వెళ్దాం గ్రాండ్ పా!

సరే.....

వాళ్ళిద్దరు క్రిందికి దిగి రోడ్డు మీదకొచ్చారు.

ఓ పెద్దాయనా! మీదీవూరేనా? ఇక్కడ అంతెత్తున ఓ గడియారం స్తంభం ఉండేది, నీ వెరుగుదువా? అదేమయ్యింది?


మేం గంటల స్తంభం అనేవాళ్ళం, అదేనా?

ఔను-

అదిప్పుడు లేదు, పడగొట్టేశారు-

ఎందుకట?

గోడ గడియారాలూ, చేతి గడియారాలూ వచ్చేశాక ఈ పని వాళ్ళకు దాని అవసరమేముంది? అయినా దాన్నిప్పుడు పట్టించుకునేవారెవరున్నారు?




కవిత

## అ=అమ్మ

ఇంకా అ, ఆ, ఇ, ఈల దగ్గర తడబడుతున్నాం!
ప్రేమ బెత్తాలతో పిడిగుద్దులతో పాఠాలు చెబుతున్నాం!
చిరునవ్వుల చిన్ని దీపానికి అరచేతుల ఆసరాలేదు
పూవంటి చేయిపట్టి అక్షరం దిద్దించిన దాఖలా లేదు
వీపుపైన తేలిన, వాతల సాక్షిగా పంతులమ్మ అహంకారం
తరగతిలో చెదరని ఉగ్ర నరసింహావతారం.
లేత కుసుమాల గుండెలో తొలి అక్షరమై పోయింది
అక్షరం అగ్నిలోంచి పుట్టలేదు ఆగ్రహం దాని రూపుకాదు
అక్షరం ఉన్మత్త భైరవం కాదు కేక దాని మూలం కాదు
పాము పాకినట్టు కాదు వీపుపై నెమలీక తాకినట్టు
అక్షరం గుండెల్ని తాకాలి గుండె అక్షరమై పోవాలి
ఉరుము ఉరిమినట్టు కాదు మావిపై కోయిలమ్మ కూసినట్టు
అక్షరం పాటై పల్లవించాలి పాట ప్రాణమై ఎదగాలి
అక్షరం అమ్మలాంటిది అమ్మ మమత లాంటిది
నాలుగ్గోడల మధ్య చదువు బందెల దొడ్డి తెరువు
భయభ్రాంతుల నీలినీడలకి అతి చేరువు
పాపాయిలకి అక్షరం పాల వెల్లిని చూపించాలి!
కెరటం ఒడ్డుని తాకినట్టు మళ్ళీ మళ్ళీ దిద్దించాలి
ప్రతి అక్షరంలో అమ్మ ముఖం కనిపించాలి
పంతులమ్మే అమ్మలా పరకాయ ప్రవేశం చేయాలి!

-గుర్రాల రమణయ్య
**99639 21943**

మీరేమో గంటల స్తంభం అంటున్నారు, మా గ్రాండ్ పా గడియారం స్తంభం అంటున్నాడు ఇంతకూ అది గడియారం స్తంభమా, గంటల స్తంభమా?

రెండూనూ-అది ప్రతి అరగంటకూ ఒక గంట కొట్టేది. ప్రతి గంటకూ, అది ఎన్ని గంటల సమయమో అన్ని గంటలు కొట్టేది. అందుకని సామాన్య ప్రజలు గంటల స్తంభమనేగాని, గడియారస్తంభమని అనేవారు కాదు.

అది ధ్వజ స్తంభంలా నిట్టనిలువుగా లేచి ఆకాశమంత ఎత్తుండేది బ్రహ్మముఖంలా నాలుగు గుండ్రని ముఖాలుండేవి. తెల్లని డైలు మీద నల్లని అంకెలతో నాలుగు దిక్కుల్నీ సమాన దృక్కుల్తో పరికించేది. అది 'ఠంగ్' అని మ్రోగితే జనం ఆశ్చర్యంతో దానిని తిలకించేవారు. గ్రామాల నుంచి జనం గూడు బళ్ళు కట్టుకుని వచ్చి దానిని 'తెల్లవాడి మాయ'' అని చెప్పుకునేవారు, అంటూ ఆ పెద్దాయన ముందుకు నడిచాడు.

ఇంతకూ ఆ నాలుగు గడియారాలకు నాలుగు గుండెలే ఉన్నాయో లేక అన్నింటికీ కలిపి ఒకే గుండె వుందో జనానికి తెలియదు. అది తెలిసిన వాడు ఒకే ఒక్కడున్నాడు..... అతడు ''విలియం కేరీ''.

విలియం కేరీ ఓ ఆంగ్లో ఇండియన్-ఆ గంటల స్తంభానికి అతడు ఇన్‌చార్జి. బ్రిటిష్ ప్రభుత్వం నెల సరి జీతం మీద నియమించిన ఉద్యోగి. అతడు ప్రతి మంగళవారం పైకెక్కి ఆ గడియారాలకు 'కీ' ఇచ్చి, కాలాన్ని సరిచేసి కిందకు దిగేవాడు. అప్పుడు రోడ్డు మీద ఆకతాయి పిల్లలు అతడి వెంట 'పరింగి, పరింగి' గోల గోలగా వెనకబడేవారు.

'పరింగి' అని ఎందుకనేవారు గ్రాండ్ పా!?

'పరింగి' అంటే ఫారినర్ అన్నమాట ఇప్పటికీ మనం 'పెన్షన్'ని ''పింఛను'' అనటం లేదా? అలాగే...

విలియం కేరీ అందమైనవాడు.

రాగిజుట్టూ, రాగి మీసాలూ, లక్క పెదాలూ, నీలి రంగు కనుగుడ్లతో ఇక్కడి ప్రజలకు భిన్నంగా కనిపించేవాడు. ఎప్పుడూ ఇన్‌షర్ట్ చేసి 'నెక్‌టై' కట్టుకుని, ఏబులం రాయంత రిష్టువాచీతో చూడముచ్చట గొలిపేవాడు.

చక్కగా పాలిష్ చేసిన నల్లని ఫుల్ బూట్‌తో ఠీవిగా నడిచేవాడు.

ఆ రోజుల్లో బ్రిటిష్ పాలకులు ఆంగ్లో ఇండియన్నును ఆంగ్లేయులతో సమాన హోదానిచ్చి ఫస్ట్ క్లాస్ సిటిజన్సుగా పరిగణించేవారు. అయినా విలియం కేరీ చాలా వినమ్రంగా ఉండేవాడు. పిల్లలు 'పరింగి' అని వెంటబడి గోలచేసినా అతడు ఏ మాత్రం పట్టించుకునేవాడు కాదు.

అతని వాచ్ రిపేరింగ్ షాపు గడియారం స్తంభానికి అభిముఖంగా ఓ మూలమీద అద్దాల బీరువాలతో నీటుగా ఉండేది. ఉప్పుటేరుకు ఇరువైపులా ఉన్న రెండు పట్టణాలకూ అతడొక్కడే వాచ్ మెకానిక్.

ఆరోజుల్లో ఇంట్లో పెళ్ళికి కట్నంతోపాటు ఓ రాబిన్‌హుడ్ బైసికులూ, చేతి గడియారమూ ఇమ్మని పెళ్ళి కొడుకు డిమాండ్ చేస్తే వెంటనే సైకిల్‌షాపులో సైకిలుని ఖరీదు చేసి రిష్టువాచీ కోసం రేషన్ షాపుకు వెళ్ళి బుక్ చేశారు. అది ప్రయారిటీ లిస్టు ప్రకారం తొమ్మిదవ నెలలో చేతికందింది. ఆ రోజుల్లో చేతి గడియారాలు ఇప్పట్లా బయట షాపుల్లో దొరికేవి కావు. అప్పుడు మా నాన్నగారు విలియం కేరీ షాపుకొచ్చి అది మంచిదేనని సర్టిఫై చేయించుకున్నారు.

కొంత కాలానికి మేం ఇల్లు మారాం.

ఉప్పుటేరుకు ఈవల రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు దగ్గర్లో ఓ అద్దె ఇంట్లోకి-కొత్తయిల్లూ, కొత్త వాతావరణం-బాగుంది.

ఈ వీధిలోనే కొన్ని ఆంగ్లో ఇండియను కుటుంబాలు కూడా కాపురమున్నాయి. డిసెంబరు నెల వస్తే చాలు, ఆ వీధి వీధంతా పండుగ వాతావరణంతో కళకళలాడుతుంది.

డిసెంబరు నెలాఖరు రోజది-

క్రిస్‌మస్ వెళ్ళాక న్యూ ఇయర్ కూడా అంత హడావుడిగానూ గడుస్తుంది. ప్రత్యేకించి రైల్వే ఇనిస్టిట్యూట్‌లో అది కన్నుల పండుగలా జరుగుతుంది.

నేనూ మరో ఇద్దరు స్నేహితులు కలిసి ఆ సాయంత్రం ఎనిమిది దాటాక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్ళి కిటికీల బయట నుండి లోనికి చూస్తున్నాం.

సెంట్రల్ హాల్ చాలా ఎత్తుగానూ విశాలంగానూ ఉంది. పడుచువాళ్ళూ, వృద్ధులూ, అతి వృద్ధులూ అక్కడున్నారు. జంట జంటలుగా కూచున్నారు. కొత్త కొత్త దుస్తుల్లో లిప్‌స్టిక్ పూసుకుని ఫుల్ మేకప్‌లో ఆడవాళ్ళుంటే, మగవాళ్ళంతా ఫుల్‌సూట్‌లో టిప్ టాప్‌గా ఉన్నారు.

ఊరంతటికీ కరెంటు లేకపోయినా, రైల్వే స్టేషనుకూ, ఇన్‌స్టిట్యూట్‌కూ, కరెంటు ఎల్లవేళలా ఉంటుంది. హాల్లో వెస్టన్ మ్యూజిక్ ఆహ్లాదంగా వుంది.

అప్పటికే అక్కడ ఓ ఐదారు జంటలు డాన్సు ఫ్లోరు మీద బాల్ రూమ్ డాన్సు చేస్తున్నాయి. అందులో విలియం కేరీ కూడా ఉన్నాడు. అతనితో డాన్సు చేస్తున్న అమ్మాయి డయానా మా వీధిలోనే ఉంటుంది.

డయానా అందగత్తె. నీళ్ళు తాగితే ఆ నీడ ఆమె కంఠంలో చూడొచ్చు.తీర్చిదిద్దిన రూపం ఆమెది. అక్కడున్న వాళ్ళందరిలోకీ వాళ్ళదే అందమైన జంట.

సంగీత వాయిద్యాలతో అక్కడి వాతావరణం ఆహ్లాదంగా వుంది. ఒకటి రెండు స్లో నంబర్ల తరువాత ఉత్తేజకరంగా మ్యూజిక్ మారిపోయింది. ఒక్కసారిగా జాజ్ మ్యూజిక్ ప్రారంభమయ్యింది.

కేరీ డయానాలు స్టెప్పులు కలుపుతూ హృద్యంగా నాట్యం చేస్తుంటే వృద్ధ జంటలు సైతం లేచి వాళ్ళతో స్టెప్పులు కలిపారు.

కాలం వేగంగా దొర్లిపోతోంది.

ఒకపాటి ఆనందపారవశ్యం ఆ హాలంతా నిండి వుంది.

ఇప్పటికీ నాకు గుర్తే - ఆ ఉత్సాహభరితమైన నంబర్లు మొదలయ్యాక సెంట్రల్ హాల్ మధ్యలో డాన్సు ఫ్లోరుమీద ఉన్న డయానా నాట్యం చేస్తూ చేస్తూ కాలి మొనవేళ్ళపై లేచి రంగుల రాట్నంలా గిర్రున తిరిగి తిరిగి ఒక్కసారిగా కేరీ గుండెల మీద మనస్ఫూర్తిగా వాలిపోయింది.

ఆ మరుక్షణమే అతని చేతి మీంచి వెనక్కి విల్లులా వంగి ఒక పాటి సమ్మోహనాస్త్రాన్ని అందరిపై విసిరి రుతువులే లేని స్వప్న లోకాల్లోకి నెమ్మదిగా నడిచిపోయింది.

మంత్రముగ్ధులై చూస్తున్న మాకు అదో కొత్త వాతావరణం-అదో కొత్త అనుభవం-వయసు రీత్యా చిన్నవాళ్ళం కనక ఒకపాటి తృళ్ళింత మమ్ము ఆవహించింది. అప్పుడు మేం ఉన్నది ఇండియాలోనా లేక లండన్‌లోనా అన్న భ్రాంతి కూడా కలిగింది.

అలసట నుండి కొంత ప్రశాంతత కోసం కేరీ డయానాలు పక్కకు వెళ్ళి జంటగా కుర్చీలల్లో రిలాక్సయ్యారు.

వెస్టన్ మ్యూజిక్ ఉత్తేజంగా హాలు నిండా వెదజ



## ప్రభుదేవాకు 'నో' చెప్పిన హన్సిక

హీరోయిన్లను ఎలా బుట్టలో వేసుకోవాలో బాగా తెలిసిన ప్రభుదేవాకు ఇటీవల ఓ ఎదురు దెబ్బ తగిలింది. కోలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని వెళ్లిన మిల్కీబ్యూటీ హన్సికతో ప్రభుదేవా రొమాన్స్ చేస్తున్నాడన్న పుకార్లు ఆ మధ్య కోలీవుడ్‌లో బాగా షికారు చేశాయి. మొదటి సినిమాతోనే హన్సిక ప్రభుదేవా మనసు దోచేసిందని కూడా కోలీవుడ్ వర్గాలు అన్నాయి. మొదటి సినిమాలో తనకు బాగా కో-ఆపరేట్ చేసిన హన్సికను రెండవ చిత్రంలో నటించమని ప్రభుదేవా అడిగాడట! విశాల్ హీరోగా చేస్తున్న సినిమా అది. అయితే ఈ సారి మాత్రం ప్రభుదేవాకు హన్సిక 'నో' చెప్పిందట! డేట్లు అడ్జస్ట్ కావడం లేదని సాకు చెప్పిందట! అయితే తను మరో నయనతార కాకూడదనే హన్సిక ఈ సారి జాగ్రత్త పడిందని కోలీవుడ్ వర్గాల భోగట్టా! ఏమైతేనేం....'నేనడిగితే కాదన్న లేడీ'సే లేరు' అని గర్వపడే ప్రభుదేవాకి ఈ సారి భంగపాటు హన్సిక రూపంలో ఎదురైందని అంటున్నారు.

ల్లుతోంది.

కాలం యొక్క వేగాన్ని ఎవరాపగలరు!

కేరీ గోడ గడియారం కేసి చూశాడు. అర్ధరాత్రి పన్నెండు గంటలు కావడానికి కొన్ని సెకనులు మాత్రమే బాకీ పడింది. వెంటనే కేరీ పక్క గదిలోకి వెళ్ళి డబుల్ బేరల్ గన్‌తో సహా తిరిగి హాల్లోకి వచ్చాడు. అక్కడ నుండి నేరుగా వరండాలోకి వెళ్ళి తన జేబులోని తూటాలు రెంటినీ గన్‌లో లోడ్ చేశాడు. బయట వాకిట్లోకి వచ్చి చుక్కలు పొదిగిన ఆకాశంలోకి చూశాడు. చేతి గడియారంలోకి మార్చి మార్చి చూసి ఆకాశానికి గురిపెట్టి ధన్ ధన్ మని తుపాకీ పేల్చాడు. అదే క్షణంలో సెంట్రల్ హాల్లోని గోడ గడియారం ఠంగ్ ఠంగ్ మని మ్రోగటం ప్రారంభించింది. అందరూ ఒక్కసారిగా చేస్తున్న డాన్సు ఆపి ''హాపీ న్యూ ఇయర్ , హాపీ న్యూ ఇయర్'' అంటూ ఒకరికొకరు షేక్ హాండ్సిచ్చుకుని తమ తమ ఫియాన్సీలకు చిరుముద్దులందించుకుని గ్రీట్ చేసుకున్నారు.

కొత్త ఏడాదిలోకి ప్రపంచం అడుగు పెట్టింది.

కేరీ డయానాలు అడుగులో అడుగేసుకుంటూ మా వీధిలో మా యింటి ముందు నుండి జంటగా నడుస్తూ వెళ్తుంటే చూస్తున్న మాకు ఏ శక్తీ వాళ్ళను వేరు చేయలేదేమోననిపించేది.

అతనితో ఆమె నిశ్చితార్థం కూడా జరిగిపోయిందట-

వివాహం అన్నింటిలోనూ ఘనమైనది అంటారు.

సంవత్సరకాలం ఎంతలో తిరిగి రావాలి?

ఈ లోగా రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ విజేత అయింది. జర్మనీని రెండు భాగాలుగా విడగొడుతూ బెర్లిన్ గోడ లేచింది.

భారతదేశానికి స్వతంత్ర్యం ప్రకటించారు. అహింసామార్గంతో సాధించుకున్న స్వరాజ్యంలో రక్తం ఏరులై పారింది. అఖండ భారతం రెండు ముక్కలయ్యింది. ఇండియా పాకిస్తాన్‌లుగా విడిపోయింది.

స్వతంత్ర భారతంలోని బ్రిటిష్‌వారు లండన్‌కు తిరుగు ప్రయాణం కట్టారు. ఆంగ్లో ఇండియన్ కుటుంబాలు సైతం ఇంగ్లాండు వెళ్ళిపోవడానికే మొగ్గు చూపాయి. వాళ్ళంతా ఇల్లూ వాకిలీ ఇంటిలోని ఫర్నిచరూ, గిన్నెలూ చెంబులూ సర్వం అయినకాడికి తెగనమ్ముకుని, వచ్చిన డబ్బును చేతబట్టుకుని లండన్ ప్రయాణమయ్యారు.

డయానా లండన్ వెళ్ళిపోవాలంది.

కేరీ ఇండియాలోనే ఉండాలన్నాడు.

ఇద్దరూ ఓ నిశ్చితాభిప్రాయానికి రాలేకపోవడానికి బహుశా పరిస్థితులతో వాళ్ళు రాజీ పడలేకపోవడమే కావచ్చు. డయానా దృష్టిలో ఇండియా ఒక నిరుపేద దేశం.

లండన్ ఒక స్వర్గ ధామం!

అందమైన నగరాలూ, థియేటర్లూ, బార్లూ, కార్లూ, విద్యుత్ దీపాలూ, సన్‌బాత్‌లూ, సముద్ర స్నానాలూ..... ఇంకా ఎన్నెన్నో....

జీవితం గూర్చి అందమైన రంగుల కలలు కంటోంది డయానా. ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన బ్రిటన్ పౌరసత్వాన్ని ఆమె ఎలా వదులుకోగలదు?

కేరీ మర్యాదస్తుడు. సర్వకాల సర్వావస్థలలో ఏ మార్పు అతనిలో కనిపించదు. సడలని వ్యక్తిత్వం అతనిది.

ఇది నా జన్మభూమి. నేనిక్కడ పుట్టాను. నా తల్లి ఇక్కడ పుట్టింది.

నా తల్లి తల్లి కూడా ఇక్కడే పుట్టింది. నిజానికి మనమందరమూ ఇక్కడ పుట్టినవాళ్ళమే-నేను నా దేశాన్ని వొదలి ఎలా రాగలను? అన్నది కేరీ వాదన.

ప్రేమికులనేవాళ్ళు ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకోవడం కాదు.

ఇద్దరూ కలిసి ఒకే దిక్కు కేసి చూడాలట. కాని అది వాళ్ళకు సాధ్యపడలేదు. కేరీ ఇండియాకేసి చూస్తే డయానా లండన్‌కేసి చూసింది.

యవ్వనంలో మనకు కావలసినదేమిటో మనకు తెలియదు.

అనుభవం పెరిగాక అవి అవివేకపు నిర్ణయాలని తెలిసి చింతించినా ఏ ప్రయోజనమూ ఉండదు.

డయానా కేరీతో తన నిశ్చితార్థం పెద్దల సమక్షంలో కేన్సిల్ చేసుకుని తన కుటుంబంతో లండన్ వెళ్ళిపోయింది.

ఎదగాయమైన వాడిలా జీవం లేని నవ్వొకటి నవ్వుతూ కేరీ డయానాకు వీడ్కోలు చెప్పాడు. దృఢ నిశ్చయంగల కేరీ ఎప్పటిలానే తన గంటల స్తంభం మీది గడియారాల బాగోగులు చూసుకుంటూ తన చిన్న వాచీ రిపేరు షాపును నడుపుకుంటూ ఇండియాలోనే ఉండిపోయాడు.

ప్రేమంటే ఏమిటో నాకప్పుడు కొంత అవగాహనయ్యింది. జంటగా రెండు పక్షులు ఆకాశంలో ఎగిరినా, జంటగా రెండు పూలు రెమ్మకు పూచినా, జంటగా అందమైన ఇద్దరు ప్రేమికులు నడిచివెళ్తున్నా కేరీ డయానాలే నాకు గుర్తొచ్చేవారు.

గ్రాండ్ పా! మాటల సందడిలో పడి మనం చాలా దూరం వచ్చేసినట్టున్నాం.

లేదురా! మనం రావలసిన చోటుకే వచ్చాం. ఇదే 'రోమన్ కాథలిక్ చర్చి' అని చర్చి గేటును చేరుకున్నారు.

మెట్లమీద కూచొని ఓ వృద్ధుడు బైబిల్ చదువుతూ కనిపించాడు.

బాబూ! ఈ చర్చి స్టెవార్డ్ ఎక్కడ?

నేనేనయ్యా..... చెప్పండి, మీకేం కావాలో-

ఇక్కడ ఓ గంటల స్తంభం ఉండేది. ఇప్పుడది లేదనుకోండి.

ఆ గడియారాలు బాగుచేయడానికి ఓ ఇన్‌చార్జి వుండేవాడు.

'విలియం కేరీ' అని ఓ ఆంగ్లో ఇండియను.

అబ్బో...... అది చాలా ఏళ్ళ కిందటి మాట. ఆయన ఈ చర్చిలో ఆర్గనిస్టుగా కూడా ఉండేవాడు. ఆయనిప్పుడు లేడు. చనిపోయి కూడా ఓ ఇరవై ఏళ్ళు కావచ్చు-

అతని తాలూకు కొడుకులుగానీ, కూతుళ్ళుగానీ, వాళ్ళ కుటుంబీకులు గానీ ఎవరన్నా ఉన్నారా?

ఆయనకు పెళ్ళీ పెటాకులూ లేవు కదా-బ్రహ్మచారిగానే ఉండిపోయాడు.

కేరీ తన జీవిత చరమాంకం వరకూ ఒంటరిగానే జీవించాడా!

అని ఒకపాటి నిర్వేదం నిలువెల్లా కమ్మి..... ఔనులే! అతని జీవితంనిండా డయానాయే ఆక్రమించేసినప్పుడు అతని హృదయంలో మరో స్త్రీకి చోటెలా వుంటుంది? పడమటిగాలి పచ్చని పూలతోటను బీడు చేసినట్లు డయానా పట్ల ప్రేమ అతని జీవితాన్ని మోడు చేసింది-అన్నాడు.

మీరు చాలా దూరం నుండి వచ్చినట్టున్నారు. అదిగో అతని సమాధి. చూసి వెళ్ళండి- అన్నాడు స్టెవార్డు.

ఒక్కొక్క ఎపిటాఫ్ చూస్తూ చదువుకుంటూ స్టెవార్డు చెప్పిన చోటుకు వచ్చారు. విలియం కేరీ సమాధి వద్ద ఆ ఇద్దరూ శిరసు వంచి కొద్ది నిముషాలు మౌనం పాటించారు.

గ్రాండ్ పా! ఈ సమాధి వద్ద నీ వెందుకింత శ్రద్ధాభక్తులు చూపుతున్నావో నేను తెలుసుకోవచ్చా!?

దేశాన్ని ప్రేమించటమే దేశభక్తి అయితే విలియం కేరీ నిజమైన దేశభక్తుడు. అంతకన్నా ఈ భారతమాత కన్నబిడ్డడు అన్నాడు.


అప్పుడే కోసిన రంగు రంగుల పూలతో స్టెవార్డు అక్కడకు వచ్చి వాళ్ళ దోసిళ్ళలో వాటిని పోశాడు. ఆ వృద్ధుడు వాటి నుండి తెల్లని పూలన్నింటినీ వేరుచేసి మిగత రంగు రంగుల పూలను సమాధిపై చల్లాడు. ఇది ఒట్టి సమాధి అనటం సరికాదు. తల్లి అక్కున చేరి ఆమె చల్లని పమిట కింద కేరీ నిదురిస్తున్నాడు-అని ఆ సమాధి ఎపిటాఫ్ వద్ద తెల్లని పూలతో అందంగా 'అమ్మఒడి' అన్న అక్షరాల్ని పేర్చాడు.

ఔను తాతయ్యా! ఇది సమాధి కాదు. ''అమ్మ ఒడి'' అన్నాడు. మనవడు.

ఇద్దరూ చర్చిగేటు దాటి తేలికయిన మనసుతో రాజమార్గం మీదికి నడిచాడు.

*

## వ్యక్తి కోసమే రచన



ఏ దేశ ఔన్నత్యమైనా ఆ దేశ ప్రజల సౌజన్యం మీదనే ఆధారపడి వుంటుంది. కనుక రచయిత మానవ సంబంధాలలోని మానవతా విలువల్నీ, ఔన్నత్యాన్నీ, వ్యక్తి వికాశాన్నీ తన రచనల ద్వారా సమాజంలో పెంపొందించాలి.

నిజానికి సమాజం అనేది లేనే లేదు. కేవలం అది మనం కల్పించుకున్న ఊహ. వ్యక్తి మాత్రమే ఉన్నాడు. వ్యక్తి ఊహ కాదు.

కనుక వ్యక్తి కోసం రచన చేయాలి. వ్యక్తి వికాసమే సమాజ వికాసం. సమకాలీన సంఘటనలను సృజనాత్మకంగా అక్షరబద్ధం చేయడం ఎలాగో తెలుసుకుని, ఆ దృష్టితో, ఆ దృక్పథంతో రచన చేయాలి.

ద్వితీయ బహుమతిని అందించిన ''నవ్య'' యాజమాన్యానికీ, సంపాదకులకూ నా నమస్సులు.

**-ముప్పిడి ప్రభాకరరావు**

**సెల్ : 92955 03024**